ఆరు సంవత్సరాల సుదీర్ఘకాలం తరువాత మళ్లీ ఆ కాలేజీలోకి అడుగు పెడుతున్నాననుకుంటేనే మహదానందంగా వుంది.

దారికిరువైపులా పచ్చటి లాన్‌లు... నీడనిచ్చే వటవృక్షాలు. వృక్షాలకు మధ్యలో అందమైన పూల చెట్లు... ఆకులతో నిండిన క్రోటన్స్ మొక్కలు... చిన్నచిన్నవిగా కత్తిరించిన బోర్డరు మొక్కలు... కనుల విందు చేసే మా కాలేజీ తోట.

పసుపు పచ్చటి కంబళి పరిచినట్లు నేల మీద రాలిన పచ్చ గన్నేరు పూలు ఏరి రంగవల్లులుగా అమర్చడం గుర్తుకొచ్చి మనసంతా ఆహ్లాదంతో నిండిపోయింది...

ఇంకా అలాంటి ఎన్నో జ్ఞాపకాలు టి.వీ.లో అయిదు నిమిషాలు ఆగకుండా ఒకదాని వెనక ఇంకోటిగా వచ్చే ప్రకటనలులా నా మనసులోకి జ్ఞాపకాల్లా వచ్చి పోయినై.

వాటితో పాటు పాత స్నేహితులు గుర్తుకొచ్చారు... నాతో బాగా క్లోజ్‌గా వున్న నా సహోద్యోగులెంతోమంది నాలానే ఉద్యోగానికి రిజైన్ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు... సో, వాళ్లెవరూ ఇప్పుడు కనిపించరు.

అంతకంటే నాకెక్కువ సంతోషం కలిగిస్తున్నది... అప్పుడక్కడ పనిచేసిన ఆయాను చూస్తానన్నదే...!

'ఆయా...! ఎందుకో ఏమిటోగానీ ఆమెను మొదటిసారి చూసినప్పుడే ఆమెతో నాకు ఓ అనిర్వచనీయమైన బంధం ఏర్పడింది.

కొత్త ఊరు... కొత్త ప్రదేశం, కొత్త మనుష్యులు... కాలేజీ కొత్త... ఇలా ఎన్నెన్నో కొత్తలు... రెండు నెలల క్రిందటే ఇంజినీరింగ్‌లో పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పాసై, ఆ ఊరి కాలేజీలో లెక్చరర్‌గా పని చెయ్యడానికొచ్చాను.

**ఎ. సువర్ణ**

ఎవరైనా నన్ను 'కాలేజీ లెక్చరర్ అవుతావా', అని అడిగితే 'కానే కాను' అని కరాఖండితంగా చెప్పిన నేను నాన్నగార్కి హఠాత్తుగా ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ కావడం, అమ్మానాన్నలను వదిలి వేరేచోట ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేక ఇక్కడ నేను చేసిన డిగ్రీకి సరిపడ్డ ఉద్యోగం ఇచ్చే సంస్థలు లేకపోవడం వల్ల ఈ కాలేజీలో లెక్చరర్‌గా చేరక తప్పలేదు.

ఎలాగో అమ్మానాన్నలను బతిమిలాడి, నచ్చచెప్పి ఒక సంవత్సరం వరకూ పెళ్లిమాట ఎత్తవద్దని ఒక సంవత్సరం గ్రేస్ టైమ్ తీసుకున్నాను...!

'పెళ్లి అయ్యాక ఏ ఊరు, ఏ దేశం వెళ్లాల్సి వస్తుందో... విద్యాధికులైన మగాళ్లందరూ పెళ్లి చేసుకుని భార్యలను తీసుకుని అమెరికా చెక్కేసే వాళ్లేగా...? అని బాగా ఆలోచించి, ఈ కాలేజీకి అప్లై చేసి ఇంటర్‌వ్యూ అన్నీ పూర్తిచేసి వారంలోనే లెక్చరర్‌గా డ్యూటీలో చేరాను...

ముందున్న లెక్చరర్‌కు హఠాత్తుగా ఫారిన్ ఛాన్స్ వచ్చి వెంటనే రిజైన్ చేసి వెళ్లిపోవడం వల్ల టీచింగ్ ప్రొఫెషన్‌లో ఏ మాత్రం అనుభవంలేని నాకా పోస్ట్ ఇచ్చారు.


చదువు పూర్తయిన రెండు నెలల్లోనే క్లాస్ రూమ్‌లో విద్యార్థుల ఎదుటకెళ్లి నిలబడతానని కలలో కూడా అనుకోలేదు.

కాలేజీలో అడుగుపెట్టిన మొదటిరోజు... ఇప్పటికీ బాగా గుర్తుంది. ఏవేవో అర్థంలేని భయాలతోను, సందేహాలతోను, ఆందోళన

తోనూ వెళ్లాను.

మొట్టమొదటిరోజు ఆలస్యంగా వెళ్లకూడ దని ముందు జాగ్రత్త కోసం అరగంట ముందే కాలేజీకి వెళ్లాను... అప్పుడు క్లాస్‌రూమ్‌లను ఊడుస్తున్న ఆయా నన్ను చూసి నవ్వుతూ "కొత్తగా ఉద్యోగంలో చేరారా అమ్మా....?" అని అడిగింది.





స్టాఫ్‌రూమ్ చూపించి, నేను కూర్చునేందు కని ఓ కుర్చీ దులిపి శుభ్రం చేసి కూర్చోమని చూపించింది.

"ఇంత తొందరగా వచ్చేసారే అమ్మా... కాఫీ టిఫిన్ ఏమైనా పట్రమ్మంటారా...?"

కడుపులో ఎలుకలు పరిగెడుతున్నా మొహ మాటానికి పోయి 'వద్దు...' అన్నాను.

"తినే వచ్చారా...?" మళ్లీ అడిగింది.

"లేదు... అయినా...!" అని దీర్ఘం తీస్తూం

టే...

"ఏమిటమ్మా...? అయినా అంటారు...? డబ్బులియ్యండి... పలహారం పట్టుకొస్తాను... అని డబ్బులడిగి తీసుకుని, కాంటీన్ కెళ్లి ఇడ్లీ, దోస, కాఫీ పట్టుకొచ్చింది.


'తరువాత కూడా ప్రతిరోజూ అందరికంటే ముందు కాలేజీకి రావడం నాకలవాటైపోయింది.

నాన్నగారు ఆఫీసు కెడుతూ కారులో నన్ను బస్ స్టాఫ్‌లో దించితే రష్‌లేని బస్సులో ప్రయాణం చేసి కాలేజీకి అరగంట ముందు రావడం అలవాటయింది. నా టేబుల్ ముందు కూర్చుని, ఆ రోజు క్లాస్‌లో చెప్పవలసిన పాఠాలకు అవసరమైన నోట్సు రాసుకుని, కాసేపు ఆయాతో కబుర్లు చెప్పడం దినచర్య అయింది.


తనని ఒంటరిగా వదిలేసి కొడుకు దేశాలమ్మట వెళ్లిపోవడం, యాక్సిడెంట్‌లో కొడుకు, కోడలూ ఇద్దరూ ఒకేసారి చచ్చిపోతే తను పెంచుతున్న మనుమరాలి గురించే ఎప్పుడూ మాట్లాడుతుంది ఆయా...

చదువు వాసనే లేకపోయినా ఆయా మాట్లాడే మాటలు, బుద్ధి సూక్ష్మత నన్ను ఆశ్చర్యపరిచేవి. ఆయా మాటలు వింటూంటే పొద్దుపోవడమే తెలిసేది కాదు.

ఇంట్లోంచి ఓ చిన్న ఫ్లవర్‌వాజ్ తెచ్చి నా టేబుల్ మీద పెట్టుకున్నాను. మొదటిరోజు




డా॥ ఎన్. గోపి రచించిన 'నానీలు' ఇంగ్లీషు అనువాదం 'నానీలు: ద లిటిల్ వన్స్'ని హైదరాబాదులో కేంద్రీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ అల్లాడి ఉమ ఆవిష్కరిస్తున్న దృశ్యం. డా॥ లక్ష్మి హరిబండి (సీఫెల్), అనువాదకురాలు ప్రొఫెసర్ పి. జయలక్ష్మి, సభాధ్యక్షురాలు ప్రొఫెసర్ టుటున్ ముఖర్జీ, మూలకవి డా॥ ఎన్. గోపి, పబ్లిషర్ ఉమేష్‌చంద్ర అగర్వాల్ ఫొటోలో ఉన్నారు.




ఫ్లవర్‌వాజ్‌తో పట్టుకొచ్చిన ఫ్లవర్స్ ప్రయాణం లోనే వాడిపోయినై.

“నువ్వు ఇంట్లోంచి పూలు పట్టుకురా కమ్మా... మన కాంపస్‌లోనే బోలెడన్ని పూలు” అన్న ఆయా మర్నాటి నుంచి రోజుకోరకమైన పూలు కొమ్మరెమ్మలతో తీసుకొచ్చి వాజ్‌లో పెట్టేది. సాధ్యమైనంత వరకూ నేను కట్టుకొచ్చిన చీరకు మేచ్ అయ్యే పూలు పట్టుకొచ్చి పెట్టేది.

జీతం రాగానే పూలకని డబ్బులివ్వబోతే తీసుకోకుండా “అమ్మా నేను చేసే పనికి కాలేజీలో నెలనెలా జీతం ఇస్తున్నారు. పూలు నేను నీ కోసం పట్టుకొస్తున్నానమ్మా. వాటికి వెల కట్టి నన్ను పరాయిదాన్ని చెయ్యకమ్మా...” అని నొచ్చుకుంది.

కాలం గడిచిపోతోంది. ఉద్యోగం ఎలా వుంటుందోనని భయపడిన నాకు ఎంతో తృప్తినిచ్చి, నచ్చిన ఉద్యోగం అయింది. నేను చదువుకున్నప్పుడు తెలుసుకున్న విషయాల కంటే ఎన్నో ఎక్కువ విషయాలు తెలుసుకున్నాను...

చెప్పే విషయం ఎలా అందంగా విద్యార్థుల మనసులకు హత్తుకునే విధంగా చెప్పాలనేది తెలుసుకోవడంతో పాటు వాళ్ళకు బోర్ కొట్టకుండా వుండే విధంగా ఎలా చెప్పాలన్నదీ తెలుసుకున్నాను. అందుకు తగిన విధంగా ప్రిపేరై క్లాసులు తీసుకునేదాన్ని. విద్యార్థులు నాకెంతో గౌరవం ఇస్తూంటే మనసుకెంతో తృప్తిగా వుండేది.

వీటన్నిటికీ మించి ఆయాతో బంధం దగ్గరవుతూ వచ్చింది. దీపావళి, సంక్రాంతి, దసరా వంటి పండుగలకు ఆయాను ఇంటికి పిల్చి ఆయాకు, ఆమె మనుమరాలికీ కొత్త బట్టలు కొనిస్తే సంతోషంతో పుచ్చుకునేది.

ఆ సంవత్సరాంతంలో వరంగల్ నుంచి పిన్ని ఫోన్ చేసింది. తనకు తెలిసిన వాళ్ళబ్బాయి అమెరికాలో ఎమ్.సి.ఎ. చేసి, మోటరోలాలో

మంచి ఉద్యోగంలో వున్నాడు, మంచి కుటుంబం - శిరీషను గురించి అతనికి చెప్పాననీ.

"నీకు తగినవాడు శిరీ... అని నాతో అనడంతో ఆగలేదు. జాతకాలు చూసి, ఫొటో చూపించి, కథ వేగంగా నడిపారు.


రెండు వారాలలో అబ్బాయి వచ్చి చూసుకోవడం, అందరికీ నచ్చడం, ముహూర్తాలు పెట్టుకోవడం, పెళ్లి అవడం... అన్నీ ఒక నెలలో జరిగి పోయినై.

పెళ్లికి వారం ముందర సొంత గ్రామానికి వెళ్లి వస్తానని వెళ్లిన ఆయా పెళ్లికి రాలేదు. అమెరికాకు బయలుదేరే నాటికి కూడా జాడా జవాబూ లేదు. నేనిక్కడ లేకపోవడం వల్ల ఆయా వచ్చిందీ లేనిదీ తెలుసుకోలేకపోయాను.

ఆరు సంవత్సరాల కాలంలో ఇద్దరు పిల్లలకు తల్లినైనాను. పిల్లల తలనీలాలు వెంకన్న స్వామికి సమర్పించేందుకు ఇండియా వచ్చాను. ఆయాను చూసేందుకనే కాలేజీకి వెడుతున్నాను.

ఆరేళ్లలో ఎన్ని మార్పులు...? ఇదివరకు అక్కడొకటి, ఇక్కడొకటి అని ఓ నాలుగైదు బిల్డింగ్‌లు మాత్రమే వుండేవి. ఇప్పుడో...? ఎక్కడ చూసినా మల్టీస్టోరీడ్ బిల్డింగులే... ఎన్నో ఆఫీసులు. అదృష్టం బాగుంది... రోడ్డు పక్కల నున్న పచ్చదనం వుంది. ఐ.టి. డిపార్ట్‌మెంట్ ఎక్కడున్నదీ అడిగి తెలుసుకున్నాను.

తెలిసిన వాళ్లు ఒకరిద్దరున్నారని తెలిసి



శ్రీమతి కందుకూరి వెంకట మహాలక్ష్మి కథల సంపుటి 'రష్యన్ సీత'ను ఢిల్లీలో ఆవిష్కరిస్తున్న ఎ.పి. భవన్ రెసిడెన్స్ కమీషనర్ శ్రీ సి. విశ్వనాథ్, రచయిత్రి, హోంశాఖ మాజీ కార్యదర్శి శ్రీ పద్మనాభయ్య, తెలుగు సాహితీ కార్యదర్శి శ్రీ ఏల్చూరి మురళీధరరావు ఫొటోలో ఉన్నారు.

తృప్తిపడ్డాను. పరస్పర పరిచయాలు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, పిల్లలు, కుటుంబాల గురించి మాట్లాడుకోవడంలో రెండు గంటలు గడిచిందే తెలీలేదు.

"నేనిక్కడ ఉద్యోగంలో వున్నప్పుడు ఒకామె ఆయాగా పనిచేసేది...! ఆమె ఇంకా ఇక్కడే పనిచేస్తోందా...?" అని ఆత్రుతగా అడిగాను.

"ఏ ఆయాని మీరడిగేది...? ఇప్పుడున్నామె చేరి ఒక నెలే అయింది. ఇప్పుడు ప్రతి సంవత్సరం ఆయాలను, అటెండర్లనూ మార్చుతూండడం వల్ల ఆరేళ్ల కిందట ఆయాగా పనిచేసినామె పేరు గుర్తులేదు." అందరూ ఇదే చెప్పడంతో నిరుత్సాహపడిపోయాను.

"అవునండీ శిరీషగారూ మీరు చెప్పే ఆ ఆయా పేరేమిటి...?" అని వాళ్లలో ఒకరు అడిగేకా గానీ అసలు ఆయా పేరే ఎప్పుడూ అడగలేదన్నది గుర్తుకొచ్చింది.

ఆమె మనుమరాలి పేరు విజయలక్ష్మి అన్నాను. ఆఫీస్ మేనేజర్‌తో... అందుకాయన విసుక్కుంటూ... మీరేమిటమ్మా...! ఎప్పుడో ఆరు సంవత్సరాల కిందట ఐ.టి. డిపార్ట్‌మెంట్‌లో గదులూడ్చిన ఆయా అంటే ఎలా చెప్పగలను...? పేరు అయినా చెప్తే అప్పటి రోల్స్‌నైనా వెతకచ్చు." అన్న ఆయనకు థాంక్స్ చెప్పి బయటకొచ్చాను.

కనీసం పేరు అయినా అడగకుండా, తెలుసుకోకుండా దాదాపు సంవత్సరానికి పైగా రోజూ చూస్తూ మాట్లాడుతూ స్నేహంగా వున్నాం. ఇంటికి పిల్చాను, కానుకలిచ్చాను. ఆమె మనుమరాలి పేరు అడిగి తెలుసుకుని గుర్తుపెట్టుకున్నాను. అయినా ఆయాపేరు అడగాలని తోచలేదెందుకనో...? ఎలా... ఎందుకని...? అని నన్ను నేనే తిట్టుకున్నాను.

> రాజకీయ నాయకుడు ఆస్పత్రికొచ్చాడు. ఎదురుగా నర్స్ మొహమంతా చిరునవ్వు పులుముకుంటూ వచ్చింది.
>
> "కంగ్రాట్యులేషన్స్ సార్! మీ ఆవిడకు కవలపిల్లలు పుట్టారు" అంది చిరునవ్వుతో...
>
> "నిజమా?... రీకౌంట్ చేయించండి ఎందుకైనా మంచిది" అన్నాడు ఆ రాజకీయ నాయకుడు అలవాటుగా.

కాలేజీ లోపలకొస్తున్నప్పుడున్న ఖుషీ ఇప్పుడు లేదు. అప్పుడు గాలితో నిండుగా ఉబ్బి వున్న బెలూన్‌నైతే ఇప్పుడు గాలిపోయిన బెలూన్ని... ఆయాకి, ఆమె మనుమరాలికని తెచ్చిన సామాన్లు చేతిలో బరువుగా వున్నయ్... వాటనెలా ఆయాకు అందజెయ్యడం...? ఆయా గురించి ఎవరికి తెలుసు...? ఎవరినడగను...? ఆలోచిస్తూ గేటు వైపుకు నడుస్తున్నాను.

ఆయాలందరూ గడ్డిపైన కూర్చుని కలుపు మొక్కలు తీస్తున్నారు. వీళ్లలో మన ఆయా వుండకూడదూ. వుంటే ఎంతో బాగుంటుంది. అనుకుంటూ తలపైకెత్తి ఆయాలందరినీ పరీక్షించి చూసా...!

'అరే...! అదిగో ఆ చెట్టు కింద నిలబడున్నది మన ఆయాలానే వుందే...!' అనుకుంటూ పెద్దపెద్ద అడుగులేసుకుంటూ చెట్టు దగ్గరగా వచ్చాను.

"అరే... శిరీషమ్మగారా...? అని నన్ను చూడగానే ఆనందంతో గట్టిగా కేకేసుకుంటూ పరిగెత్తుకుని నా దగ్గరకు వచ్చింది ఆయా...

నేను ఆయాను అడిగిన మొదటి ప్రశ్న...

"ఆయా... నీ పేరేమిటి...?" ●